కథానిక

# "అంతర్వాహిని"

## శ్రీ కందుకూరి లింగరాజు

ఆరోజుల్లో ఎన్నో విధాల ఆలోచనలు రాజాన్ని కమ్ముకున్నై ఇంతవరకూ జీవితం స్వేచ్ఛగా, చీకూ చింతా లేకుండానే గడిచింది తన ఇష్టంవచ్చినప్పుడు లేవడం, ఏదో తీరుబడి వుంటే కథలు వ్రాసుకోవడంతోటి గడిపివేశే వాడు సాయంత్రాలు ఈ పచ్చిక పైరుల్లో, స్నేహితుల్లో గడచిపోయేది

ఇకముందు ? ఇదే శేషప్రశ్న అయి కూర్చుంది ఆరోజుల్లో ఆలోచించేడు నిర్ణయం లేక బాధపడ్డాడు కూడాను స్నేహితులు అంతా అన్నారు "జీవితంలో పెళ్ళి చేసుకోబోకు"అని అల్లా వుండాలనే అనిపించింది ఆ వుద్దేశాన్ని చాలాకాలం పాటించేడు అయినా అదీ చెదరకుండా వుండలేకపోయింది

ఆరోజు కాబోలు వాళ్ళ అమ్మ అంది "కస్తూరి వారి అమ్మాయిని చూడ్డానికి రమ్మన్నారు రేపు పంచమి ఆదివారం బావుందిట మాధవశర్మబాబాయి వాళ్ళ వూరునుండి కాకినాడ వస్తానన్నాడు ఇద్దరు కలసివెళ్లి చూచిరండి ''అంది

ఓ విధమైన అవివాహితజీవితం ఆమాటల్కి తిరగబడింది ఎదురుచుంది ఇదివరకల్లా చూచినపిల్లల్ని త్రోసిపుచ్చెయ్యడం ఓ నిర్ణయం క్రిందనే పెట్టుకొని నెగ్గుకు వచ్చాడు ఇప్పుడూ

తన భావాన్ని తల్లిపసికట్టినట్టే తల్లి అందుకుంది "సంపన్నులు, గౌరవనీయులు " ఏవో ఏవో చెప్పింది మాధవశర్మ బాబాయిమీద కోపం వచ్చింది ఉన్నవూళ్ళో వుండక పెళ్ళి సంబంధాల్ని కుదిర్చే ఉద్యోగం ఓటి సంపాదించి, తనకికూడా సాలిగూడును అల్లుతున్నాడని

జట్కాఎక్కి స్టేషన్కి వెళ్ళుతుంటేనే, 'ఏదో నాయినా ఏభైయ్యేపడి దాటింది త్వరగా ఎవర్నో ఒకర్ని కుదుర్చుకుని, పెళ్ళి చేసుకో నీకడవునా, నాలుక్కాయలు కాస్తే చూడాలని వుంది' అంది గద్గదంతో

అతనికి జాలి తోణికింది 'అల్లాగే అమ్మా!' అందామనుకున్నాడు ఆవిణ్ణి చూస్తేనే చాలు హృదయం బాధ పడుతుంది తనజీవితంలో అంతకంటే దైవం లేనేలేదు ఆముక్కల్లోని మార్గనం వూచింది

అమ్మ! ఆవిడా తన్నిగురించి బాధపడుతోంది, దుఃఖిస్తోంది! అంటే ఓర్చుకోలేకపోయేడు

అమ్మ! అంతవరకు, తన పాతికవత్సరాల పైబడిన జీవితంలోన, తనభావి, బాగోగులు, ఆరోగ్యం, ఉన్నతికోసం త్యాగం చేసింది ఇంకా చేస్తూనే వుంది, చేస్తుందికూడా భావిలో "ఇంకా ఎన్నాళ్ళు చేయించుకుంటావ్ ?'' అనే సత్యదూరాలు స్మృతికి వచ్చినప్పుడు, తనే బాధపడవలసి వస్తోంది

కాని ఒక్కటే పట్టుకుంది తనకి అశాంతి తెచ్చి పెడుతోంది 'రేపు ఆ కట్టుకున్న అమ్మాయి వస్తే తను దూరం మరంతదూరంగా తల్లి ఆదరణ, ప్రేమ, వాత్సల్యంకు అయిపోతానేమో' అని బాధపడ్డాడు ఈ భావనకు ఎవరు అర్థంచెప్పి భాష్యం చెయ్యగలరు ?

అంతవరకూ,-తను ఉదయం ఆలస్యంగా లేచినా, బద్ధకంగా వున్నా,సరిగ్గా కబుర్లు చెప్పకపోయినా, ఆరాటపడిపోయే అమ్మకి దూరం అయిపోతానేమో అన్న బెంగే ఆ నూత్నజీవి వచ్చి, ఈ రెండుజీవితాల్లోని సరస్వతీఝురుల్ని, దూరతీరాలు, సమానాంతరాలుగా చేస్తుందేమో?

అయినా, తనతల్లి మారదు, మారలేదు పాతిక సంవత్సరాలనుండీ పెంచుకున్న అమరభావాన్ని త్రెంపెయ్యలేదనే అనుకున్నాడు, వచ్చీరాని మాటల్ని లోపల్లోపలే పెట్టుకుని ఆ జనవరి నాల్గోతారీఖున ఆ కస్తూరి వారి అమ్మాయిని ఉద్వాహం చేసుకున్నాడు

తన తల్లి మురిసిపోయింది పొట్టిగా, ఎర్రగా, గుండ్రంగా, తేనెరంగు కళ్ళు, మధ్యపాపిడితో వున్న సుందర్ని చూచి 'మా కోడలు' అని బహుశః ఓ లక్షసార్లు, చెప్పినవాళ్ళకే చెప్పిందేమో! ఆవిడ సంతోషంలో కళ్ళుతుడుచుకోవడం చూచి, ఓ విధంగా గర్వపడ్డాడు తనకు తృప్తి నిచ్చింది, తల్లి సంతోషపడిందికదా అని

ఆ మొదటి రోజులు తను అనుకున్న, కట్టుకున్న అనుమానాలన్నీకూడా పునాదులు లేనట్టే కన్పించేయి మానవదౌర్బల్యంకు నవ్వుకునే సిగ్గుపడ్డాడు

రెండునెలలు దాటింతర్వాతనే కాపురానికి వచ్చిందిసుందరి ఆ సాయిసత్రం ఇంట్లో కాలు పెడుతున్న సుందర్ని చూస్తే క్షణికం వెనుక తను, భయపడిన సన్నివేశాలు ఒస్తాయేమో అని తట్టింది తన ఊహలకి తావు లేదని ఆ సాత్వికం, అందంలో ఓడుతున్న శాంతతా చెప్పింది తను ఉలిక్కిపడ్డాడు

ఆ వారంరోజుల్లోనూ సుందర్ని వెయ్యికళ్లతో భావన చేసేడు తనతల్లిలో ఏమైనా పరివర్తన వస్తోందేమో అని పరిశీలన చేస్తూనే వున్నాడు తన వూహలే అని ఆత్మలు గోలెత్తుతుంటే తల తీసుకున్నట్టే అయ్యింది అయినా

ఇప్పుడు ఈ స్థితిలో జీవితం మారింది ఇదివరకల్లా, తనతల్లి ఆక్రమించుకున్న దినచర్యల్లో సుందరి పైచెయ్యి అయింది—తనను లేపడం, కాఫీ ఇయ్యడం, భోజనం వడ్డించడం ఇత్యాదుల్లో ఈ నూత్న మార్పు హృదయాన్ని ఆనందం కల్గచేస్తూనే వుంది అమరత్వం తీసుకుంటూనే వుంది కొన్నిక్షణాల్లోమాత్రం ఇదివరకు ఈ పనులన్నీ "మీ అమ్మ చేసేదోయ్! ఇప్పుడు ఆమె నీదగ్గరనుండి, సుందరిమూలాన్ని దూరం అయ్యింది చూచేవా?" ఈ తలంపు శరీరాన్ని ఉడికించేది సుందరిమీద కోపం తెప్పించేది అయినా తను ఏమీ చెయ్యలేని పరిస్థితిలో పడిపోయేడు

ఒకటి మాత్రం ప్రతిక్షణంలోనూ నంచునేది తనతల్లి తనకి దూరం అయిపోయింది ఇదివరకు ఏచిన్న విషయం అయినా తల్లితో చెప్పేవాడు తన సపర్యల్లో తల్లి పూర్ణంగా ఆక్రమించుకుంది ఇప్పుడు సుందరి ఆక్రమించుకుందుకు వుచ్చులు పన్నుతోంది, పన్నింది ఈ తెలియని ఆవేదన సుందరిమీద కోపం తెప్పిస్తోంది "వాళ్ళింటికి పంపేస్తే, కొన్ని నెలలవరకు, కనీసం తనకు ఉద్యోగం అయ్యేవరకూ కూడా తీసుకురాకుండా వుంటే " ఇల్లాంటి ఆలోచనలు తట్టేయి

పంపించెయ్యాలి! తనతల్లిని తనదిగా చేసేసుకోవాలి! కేలండరుకాగితం చూచేడు కొత్తగా పెళ్లి కూతుళ్ళు నోచుకునే నోములు ఏమైన కొద్దిరోజుల్లో వున్నాయేమో అని కనిపించలేదు సిద్ధాంతిని గర్రిగా తిట్టకున్నాడు తన స్తబ్ధత ఎందుకూ పనికిరాని నపుంసకుడిలా కూర్చోపెట్టింది సిగ్గు, కడుపులో బాధ, గుండెల్ని నలిమియేసింది

మర్నాడు పొద్దుటే 'అమ్మా' అనిపిల్చేడు ఆవిడా 'ఎందుకురా'' అని భయంతోనే అని "మీ ఆవిడ వేణ్ణీళ్ళు తోడిపింది వెళ్ళు" అంతే! నీళ్ళగదిదగ్గరకి నడచి వెళ్ళేటప్పటికి కళ్ళమ్మట నీళ్ళు తిరిగేయి దుఃఖం వచ్చింది సబ్బుబిళ్ళ తువ్వాలు పుచ్చుకుని నుంచున్న సుందరి మీద ప్రళ్లమాలిన కోపం వచ్చింది

'మహామ్మారీ!' అందామనుకున్నాడు లోనున్న ఆత్మలు తిరగబడ్డాయి తల వంచుకునే నీళ్ళు పోసుకున్నాడు ఒళ్ళు తుడుచుకున్నప్పుడు, తనకి ఎక్కడినుండో వచ్చి సమస్తం, ఆ జన్మాంతరం ఇచ్చెయ్యడానికి సంసిద్ధ అయ్యిందే, ఆ పెకంటె

'ఏమైనా తల్లిని దూరం చేసింది' అన్న భావం వదలటం లేదు జీవితంలో 'ఎల్లా, తల్లి, భార్యల మధ్య గడపాలి' అన్నదే సమస్య అయ్యింది. ఇదే కాబోలు ప్రతివాడినీ బాధపెట్టే ఆందోళన అనుకున్నాడు

రోజులు గడుస్తున్నాయి తన విషయంలో తల్లి చెయ్యరాని అన్యాయం చేసినట్టే వుంది! 'అంతా సుందరికి నేను ఇచ్చేసేను' అన్నట్టే ప్రవర్తించింది ఆఖరుకు మాట్లాడ్డానికైనా తీరుబడి లేనట్టే తిరుగుతోంది తను ప్రయత్నించినా విఫలమయ్యే పంగతిక్రింద తయారైంది 'ఎవర్నీ అర్థం చేసుకోలేక ఈ విధంగా తను ఎందుకు అడకత్తెరలో ఒక్కలా తయారు అయ్యేడో' అని బాధ కల్గింది

ఆరోజు కాబోలు అత్తగారు ఉత్తరం వ్రాసింది—సుందరిని ఓసారి పంపమని ఉత్తరం చదవుతుంటే, ఓ విధంగా తనకి వళ్లెవాటు తీసినట్టే అయ్యింది ఓవిధమైన రేలికపడ్డట్టే అయ్యింది సుందరితో అన్నాడు—మీ 'అమ్మగారు నిన్ను పంపమని వ్రాసే'రని

ఓసారి ఏర్పడ్డ అలవాటుల్లోని వియోగంకు బాధపడినట్టుగా చూచి 'అత్తగారిని అడగండి ఆమె వెళ్ళమంటే వెళతాను' అంది ఒక్కసారిగా ఆశ్చర్యంలో నోరుతెరిచేటట్టేఅయ్యింది ఆ జవాబు సుందరి ఆ విధంగా చెపుతుం దని తను ఎప్పుడూ ఊహించనే లేదు ఇప్పుడు ఈ నూత్న నియంతృత్వఅలవాటులు విఘ్నం కల్గుతుందేమో అన్న భావనలోనే 'నే వెళ్ళను మా అమ్మకి పనీ పాటూ లేదు అస్తమాలు రమ్మంటుంది' అంటుం దేమో అనుకున్నాడు

పైగా అత్తగారిని తన భర్తదగ్గరనుండి ఎంత దూరంగా ఉంచితే అంత తన భావికోసం మంచి దని అనుకుని, దివాణం చెలాయిస్తూ, ఆఖర్కి ఆమెను మాట్లాడ్డానికి అయినా భయపడేటట్లుచేసిన సంసిద్ధతను, సుందరి ఆ విధంగా భగ్నపరుస్తుం దనుకోలేదు తన ప్రపంచకంలో ఈ సమీక్షకు ఆధారాలు కల్గనూ లేదు ఈ స్త్రీ ప్రవృత్తులను ఎల్లా అర్థం చేసుకోవాలో కూడా బోధపడటం లేదు

అత్తగారంటే ఇంత భయభక్తులు, అణకువ గౌరవం కలిగియుండి తన తల్లి అంత దూరం అవడానికి సుందరి ఏ విధంగా కారణభూతురాలో అవగాహన అవలేదు

ఉత్తరం చేతో పట్టుకుని పెరుగు చిలుకుతున్న అమ్మతో చెప్పేడు "అమ్మో! ఆవిడ అంతగా వ్రాయాలా క్రొత్తపాపం!వాళ్ళమ్మని చూడాలని బెంగ పెట్టుకుందేమో వళ్ళి దిగ విడిచిరా'' అంది

ఈ సమాధానానికి, ఆవిడనిండుకుండతనం అర్థం కాలేదు తెల్లబోయేడు అన్నీ సమస్యలే అవుతున్నాయి సమస్యలు అర్థం కాని సన్నివేశాలు అంతులేని సమాధానాలు

'బజారుకు వెళ్ళి లక్క పట్టంచు చీర ఓటి కొనుక్కురా రవికల జడ్డ వాళ్ళ మంగమ్మ కుట్టించుకుంది, అల్లాటిది తీసుకురా. భూషణంతో చెప్పు, ఓ పాతిక కొబ్బరికాయలు తీసుకురమ్మని ' ఆ వరసలో ఎన్నో చెప్పింది

ఆ ఆదివారం వాళ్ళన్నయ్యే వచ్చేడు బండి ఎక్కించే పంపించేశేడు సుందరి వెళ్ళిపోయింది బహుశః ఓ నెల్లాళ్ళవరకూ తను ఆమెను చూడనే చూడడు

ఆ రాత్రి ఇల్లు బావురుమన్నట్టే అయ్యింది. ఏదో శూన్యత! లోపం! అలావాటల్ని బలిపీఠం మీద నరికినట్టే కన్పించింది.

అన్నం వడ్డిస్తున్నప్పుడు అమ్మ అంది 'సుందరి బుద్ధిమంతురాలు పని పాటలు తెలుసు ఎంత వినయం—' ఆ మాటలు రాజాన్ని చాలా ఇరుకులో కూర్చో పెట్టేయి సంయుక్తత అందలేదు అడుగుదా మనుకున్నాడు చెప్పేద్దామని నోటి చివరనరకూ వచ్చింది 'సుందరి నిన్నూ నన్నూ దూరం చేసిన మహామ్మారి కాదా?' అని అయినా గుండెలు నిలకడ అవటం లేదు

"ఇల్లంతా బావురుమని పోయింది లక్ష్మిలా తిరిగేది, ఎప్పుడూ నవ్వుతూనూ నన్ను ఒక్క పని చెయ్యనిచ్చేది కాదు"

మంగలంలోని పేలాపగింజ అయ్యేడు భావనలోని శక్తులు ఎదురుతిరిగేయి భరించలేని బాధ ఆ వేదన ఒక్కుమ్మడి ఎదురు తిరిగేయి

"అల్లాగా!" నోటమ్మట విసంలోనే మాటలు వచ్చేయి. అమ్మ నవ్వింది,అందులోనిఆఘాతాలు, ఆందోళన, ద్వేషం అర్థం అయినట్లే గుండెల్లో బాకు పొడిచినట్టే అయ్యింది రాజాకి . .

"వెర్రివాడా! 'నిన్నూ, నన్నూ దూరం చెయ్యడానికి వచ్చింది' అని అనుకుని బాధపడుతున్నావు కాదూ? నేను మాట్లాడనే లేదు, ఇదివరకటిలా ఉండలేదని లోపల్లోపలే బాధపడుతున్నావు కాదూ? " అంది

ఇప్పుడే తనకి జ్ఞానోదయం అయినట్టే వుంది. తన అమ్మను ఇన్నాళ్ళు అర్థం చేసుకోలేకనే పోయేడు ఎవరో చెప్పిన వాక్యాలు జ్ఞాపకం వచ్చేయి 'జీవితంలో ఒక్క స్త్రీని అర్థం చేసుకుని మరణిస్తే చాలు' అన్నది

'చాలా వెర్రిగా తయారయ్యేవు ఈనాడు నా జీవితంలో, నవ్వూ, కోడలూ ఈ ఇంట్లో తిరుగుతూ, అధికారం చెలాయిస్తూ వుండటం చూడ్డంకంటె నాకు జీవితంలో ఇంకోకోర్కె ఏ ముంది? మీ ఇద్దరే కాదా నాకు రెండు కళ్ళూనూ ఈనాడు, నా కోడలు నా తర్వాత నా హుందా ఆక్రమించుకోవట్లు చూడ్డంకంటె నాకు ఆనందం ఏ ముంది? "

గీతకి భాష్యం చెప్తూతోందా? తను వింటున్నాడా? "అయితే నువ్వు సుందర్ని ద్వేషించటంలేదా?" అనగల్గేడు

"ద్వేషించడమా!" ఆశ్చర్యంతో నవ్వింది. "నీకు అర్థం కాని విషయాలు వుంటాయి. సుందర్ని నేను ప్రేమించినట్టుగా ఎవరూ, ప్రేమించలేరేమో మనింటికి లక్ష్మిరా, ఆ పిల్ల! నువ్వు ఏ అదృష్టం చేసుకున్నావో కాని "

ఆ మాటలు వింటుంటే కళ్ళమ్మట, అమ్మ మీద కల్గిన ఆరాధనలో నీళ్ళు తిరిగేయి. చెయ్యెత్తి నమస్కరించాలని ఆత్మ తోసింది. నెమ్మదిగా తువ్వాలుతోనే ముక్కు తుడుచుకుని, దొడ్లోకి వెళ్ళేడు

ఆనందం కల్గుతోంది తన భావాన ఈ అంతర్వాహినీసరస్వతీఝురల్లో తుంపురుల్లా తెగిపోయింది 'అమ్మ, సుందరీ! ఒక్కటే' తనే ఓడిపోయేడు అనుకున్నాడు

సుందరికి ఉత్తరం వ్రాసేడు—'అమ్మ, నువ్వు వెళ్లిపోయినందుకు బెంగ పెట్టుకుం దని ''

సరస్వతీనదిని చూచినట్టే అయ్యింది రాజాకి ఆనాడు ఆ రాత్రి.


